# టిరనీ

గోవిందరావును ఒక్కసారిగా నిరుత్సాహం, నిరాశా, నిస్పృహా ముంచేసినై. కుర్రవాడు పేకముక్కలతో ఎంతో కష్టపడి నాలుగంతస్తుల మేడ కట్టి దాన్ని చూసి మురవటం పూర్తి చెయ్యకముందే చిన్న గాలి కొట్టి అదంతా నేలమట్టమయితే వాడి మనస్సెంత ఖేదిస్తుందో, గోవిందరావు మనస్సంత ఖేదించటం మొదలుపెట్టింది. ఆ పెంకిపెళ్లాం మీద- ఆ అనాకారి కోతిమీద-ఎంత ఆపేక్ష తెచ్చిపెట్టుకున్నాడు! ఎంత పరాసయింది! గగన సౌధాలన్నీ ఒక్క పిల్లగాలికి గభిల్లున కూలినై. అతని మనోనేత్రం ఎటు తిప్పినా కనపడతున్నది ఆకాశమే. ఒక మనస్సులోనే కాకుండా శరీరం లోపలకూడా డొల్లగా ఉన్నట్టనుమానం తట్టిందతనికి. ఈ శరీరం లోపల డొల్లగా వుండటమనేది గోవిందరావు చిన్నతనంలో ఒకసారి కాబోలు అనుభవించాడు—ఒక స్నేహితుడి సలహామీద బీడీ కాలుస్తూ బడిపంతులు కళ్ళపడ్డప్పుడు.

ఇదంతా యిలా వుంటూండగా అంతరాత్మ ఎకట ఎలా పడ దామా అని అతని కొక పెద్ద బెంగ.

ఈ చివరముక్క అందరికీ సులభంగా అర్థం కాక లందులకు—

బానిసత్వం అనేక రకాలుగా వుంటున్నది ఒక దేశానికి మరొకదేశం దాస్యం చెయ్యటం అనేది అలా వుంచి— లోకాభిప్రాయానికి దాసులు కొందరు, బంధుకోటికి దాసులు కొందరు, గట్టిగా మాట్లాడగల వాళ్ళకల్లా దాసులుకొందరు, భార్యలకు దాసులు కొందరు. మతాచారాలకు దాసులు కొందరు వ్యక్తులు రక రకాల దాస్యం చేస్తున్నారు. కాని అన్నిరకాల్లోకీ చిత్రమైన రకం అంతరాత్మకు దాసులు. ఈ బానిసత్వంలో వున్న విశేష మేమిటంటే, ఇది . యితర దాస్యాల మోస్తరుగా చప్పున బయటపడదు. ఈ వ్యక్తుల నమ్మకం అంతరాత్మ చెప్పిందల్లా వేదవాక్యమనే! అంతరాత్మ పొరపాటు పడదనే! అంతరాత్మకు దాస్యం చేస్తూ వీళ్లు చాలా గర్వపడతారు వీళ్ళ బుర్రల్లోకి తర్కం ఎక్కదు. వీళ్ళకెంత చెప్పీ లాభంలేదు. భారతంలో ధృతరాష్ట్రుడిదే మచ్చు. 1938 లో గోవిందరావిదేరకం.

ఇతరులకు కైంకర్యం చెయ్యటంలోనూ అంతరాత్మకు చెయ్యటంలోనూ ఇంకో తేడా కూడా వుంది. ఇతరుకు పొరపాటుచేసి యజమాని కంటపడకుండా తప్పించుకు పారిపోవచ్చు. అంతరాత్మకు చేతులు జోడించినవాడి కా అదృష్టం లేదు. కనక గోవిందరావు వెధవ మొహం వేసుకుని అంత

రాత్మ వినేటట్టు, "నా పెళ్లాం హనుమంతరావుతో పోతు న్నది. నేనేం చెయ్యను ?- ఎలా యీడవను ?" అన్నాడు. [ఎలా యీడవననేది అంతరాత్మకు కవికరం కలిగేటందుకు!] బెల్లంకొట్టిన రాయల్లే అంతరాత్మ నోరు తెరవలేదు. [అదే గుర్తు నోరు చేసుకుంటే ఒకంతట వదిలిపెట్టదని]

హెచ్. క్యూ. నుంచి అర్జర్సుకోసం ఎదురుచూసి, విసిగి, గోవిందరావు ఆలోచనలోపడి కాస్సేపు ఆశ్చర్యరసం అనుభవించాడు. తన పెళ్లాంలో హనుమంతాయి ఏం చూసి నట్టు ! అందచందాల విషయం అట్టే పట్టుదలలేని తనకే తన పెళ్లాం మరీ ఇంత కురూపందుకొచ్చావా లని పిస్తుంటే –

"అడ గొరిల్లాకూడా బాగుంటుంది, నీ పెళ్లాం కాక పోతే సరి!" అని గొణిగింది అంతరాత్మ.

"నాకు వాణ్ని చూస్తే చాలా జాలేస్తుంది" అన్నాడు గోవిందరావు పాపం, తెలీక. దాంతో తుపాను బద్ద లయింది.

"ఎవణ్ని చూస్తే జాలి ? ఛీ ! బృహన్నల వెధవా ! సిగ్గులేక జాలంటున్నావా?"

"ఎందుకలా తిడతావు?"

"తిట్టానా, నిన్ను నరికితే పాపం వుందా?"

"నేనేం చేశాను?"

"ఏం చెయ్యలేదు కనకనే ! పెళ్లాం ఎవడితోనో పోతూంటే ఏం చెయ్యకుండా వూరుకున్న ఆడకుంకవు నువ్వు తప్ప ఇంకెవడూ వుండడు."

"ఇంకోలైతే మాత్రం చేసేదేముంది!"

"నువ్వు ఆరు సంవత్సరాలకింద పున్నయ్యవిషయంలో ఏమన్నావు!"

"నాకు జ్ఞాపకంలేదు."

"అయితే నాకు జ్ఞాపకం వుంది చెబుతా విను. 'ఎప్పుడయితే ఆడముండ పైవాడితో యిలా కాపెట్టుకుంటుందో అప్పుడు మగవాడయినవాడు దాన్ని, వాణ్ణి చెరోపోటూ పొడిచి నూతి పక్కన గొయ్యితీసి పూడ్చిపెట్టి చేతులు కడుక్కోవలిసిందే! మరో ఉపాయం ఆలోచించటం గొల్ల భామ మార్కు పాండబ్బాలకు ప్రత్యామ్నాయం అన్వేషించటమే. యిదే నలుగురూ తొక్కినదారి అందరికీ తెలిసిన క్రియ, బైరాగీ చిటిక, అమృతాంజనం డబ్బీ అంటూ తడుముకోకుండా వుపన్యసిస్తివే."

"అప్పుడు తప్పకుండా పొరపాటుపడే వుంటాను."

"నేను పొరపాటు పడనిస్తానా ఏమిటి! ఇప్పుడే వెధవవవుతున్నావు."

"అయితే నన్నిప్పుడు వాళ్ళిద్దర్నీ చంపమంటావా ఏమిటి? వూరుకో, పుణ్యానికి! నా మెడమీద తలనిలిచే ఏర్పాటు చేసేటట్టు కనపళ్ళేదు నువ్వు"

"ఓరి నపుంసకుడా, పాచిపీనుగా! ముదనష్టపు కుంకా! మానం పోయినతరవాత ప్రాణమెందుకురా!"

పోయింది నా పెళ్లాం కూనంకాని నాదికా దండా నుసుకున్నాడు గోవిందరావు. కాని ధైర్యం చాల్లేదు.

"అయితే నన్నేం చెయ్యమంటావు ?"

"నే చెప్పినట్టు వింటావా ?"

"ఆహా ! యావజ్జీవం హాం ఫ్యామి ! నీ కెందు కను మానం?"

"అయితే ఈ రాత్రే నీ పెళ్లాన్నినరికి ఉప్పు పాతట్లో పూరెయ్యి ముందు."

గోవిందం నిర్ఘాంతపోయినాడు.

"ఆడదానిమీదనా చెయ్యిచేసుకోటం? ఆలోచించు, సనాతనిస్టు లేమంటారో!"

ఇది నిజంగా ఆలోచించవలసిన విషయమే.

"పోనీ దాన్ని వదిలిపెట్టేద్దువుగాని. మరి హనుమంత రావు గొంతెప్పుడు కోస్తావు!" [గోవిందరావు తలగోక్కు న్నాడు] "ఏమిటా ఆలోచన ! నీ మొహం ఆలోచన!"

"అంటే—నాకు వాణ్ని చూస్తే అంతకోపం రావటం లేదేమరి!"

"ఎంతకోపం?"

"చంపేటంత కోపం."

"నువ్వు పుట్టుకుంకవని నాకు మొదణ్ణించీ తెలుసును. నువ్వు నిజమయిన క్షాత్రం - మగసిరి—కలవాడివే అయితే - [నేను బ్రాహ్మణ్ని కదా అందామనుకుని మానేశాడు గోవిందరావు]-హనుమంతరావును వెతికి చిత్రవధ చేసేటంత కోపం వచ్చేదే నీకు ! భీరుడూ వాళ్లూ చూడు ! ఎహ

రెండో పక్షం, కోపం తెచ్చుకోటం ! ఇప్పటికైనా కోపం తెచ్చుకోరా, చచ్చు వెధవా?"

"తెచ్చుకుంటాను. వెధవని నరికేస్తాను"

"అలా!...ఏం పెట్టి నరుకుతావు?"

"ఏమో"

"ఓయి తెలివితక్కువ దద్దమ్మా ! ఏమోనంటావేం ? నీ పెనసలు చెక్కుకునే కత్తిలేమా ? మంగలికత్తి లేమా?"

"వున్నది"

"ఇంకేం?"

"అయితే నా రేజరు తీసుకుని చీకట్లో వెనకనించి మీదపడి అమాంతా గొంతు కోసేస్తాను. ఏం?"

"నీకు పగతీర్చుకునేటందుకు అప్రూవుడు పద్ధతులు కూడా తెలీవేం ? నువ్వు వాణ్ణి చంపేటప్పుడు వాడికి తెలియాలి ప్రాణాలిపని కిది శిక్ష అని. లేకపోతే నీ నెత్తురు చల్లారకూడదు."

"యెందుకు చల్లారదు? నువ్వు మాట్లాడుతుంటేనే నా శరీరం మంచు కుండల్లే అవుతుంటే!"

"ఓరి నిర్భాగ్య దామోదర-"

"చెప్పు, చెప్పు."

"చల్లారుతుందా, చల్లారదా?"

"ఆ"

"ఇవన్నీ నువ్వేం చెయ్యాలి? హనుమంతరావును రాత్రి పదిగంటల కింటికి పిలిపించటం, తరవాత వాణ్ణి కాస్తా- వెంటనే దొడ్లో ఆరడుగుల లోతు గుంట తీసి వాణ్ని పాతెయ్యటం, ఆ మేరకు తోటకూరమడి వెయ్యటం, అంతా గంటపని."

గోవిందరావు బాగా యోచించాడు.

"నువ్వు చెప్పింది చాలా అద్వితీయంగానే వుంది కాని కొద్ది అనుమానాలున్నై."

"ఏమిటవి?"

"ఒకటి-హనుమంతరావు రాకపోతే? రెండు- ఇంకోర్ని వెంటపెట్టుకొస్తే? మూడు-నేను మాట్లాడుతుండగానే సంగతి గ్రహించి వాడు లేచిపోతే? నాలుగు-నా చేత వాడు నిశ్శబ్దంగా చావటాని కొప్పుకోక కేకలు పెడితే? అయిదు-వాడే నన్ను చంపితే? ఆరు..."

"చాలు. నీ సంగతి నా కక్కర్లేదు. నిన్ను యీ క్షణం నించీ వదిలేస్తున్నాను"

గోవిందరావుకు పెద్ద చిక్కే వచ్చిపడ్డది. పిల్లలు యిళ్ళల్లో లేచిపోవటంతో మొగుళ్ళ నెత్తిన యింత బాధ్యత పడుతుందని అతను కల్లోకూడా అనుకోలేదు. అతనిప్పుడు చెయ్యవలసిన కర్మకాండంతా చూస్తే, అంతకన్న వరసను నూరుమంది ఆడపిల్లల పెళ్ళిళ్ళు చెయ్యటం, వెయ్యిరెట్లు సులభంగా వుంది. పైగా, భార్యాచేతయినా వెధవగా చూడబడుతూ జీవించి ఉండవచ్చును గాని, అంతరాత్మ వెలివేసినతరవాత ఒక్క క్షణం మనశ్శాంతి వుంటుందా!

గోవిందరావు ఒక్కటే అనుకున్నాడు. 'చాటు వ్యవహార మిందుకు ? మగతనానికి భంగం రాకుండా పట్టపగలే, నలుగురూ చూస్తుండగానే హనుమంతరావును చంపటానికి ప్రయత్నం చేద్దాం ! పట్టుకుని జైలులో పెడతారూ, నేనేం చేస్తాను ? వాడు తప్పించుకు పోయినందుకు కష్టంగానే వుంటుంది. కాని, ఏం చేస్తాను ? మనుష్య ప్రయత్నంలో లోపం వుండదు."

గోవిందరావు లేచి కోటు తొడుక్కొని, కోటులోపలి జేబులో గడ్డం చేసుకునే రేజరు పెట్టుకుని హనుమంతరావింటికి బయలుదేరాడు. ఆయుధ జేబి అయినా అతనికి ఉద్రేకం పుట్టలేదు. గుండె ఎర్రగీతదాటి పనిచేస్తూనే వుంది.

హనుమంతరావింట్లో లేడు. గుంటూరు పోతానని చెప్పి బయలుదేరాడట. గోవిందరావు గడియారంచూశాడు. గుర్రబ్బండీ చేసుకుంటే తనకు గుంటూరు బండి అందుతుంది దూరాన పోతున్న బండిని పిలిచాడు గోవిందరావు.

ప్లాట్ఫారంమీద హనుమంతరావు కనపడి, "ఏమిరోవ్, ఎక్కడిదాకా?" అన్నాడు.

"ఏనుండి గుంటూరు బయద్దేరానురా. నువ్వు ?"

"నేనూ గుంటూరేరా, ఖాళీపెట్టె చూడు. కూర్చుందాం."

రైలు కదలబోతున్నది. యింకెవ్వరూ పెట్టెలో ఎక్కరేమోనని గోవిందరావు భయపడటంమొదలుపెట్టాడు.

కూచిపూడి భాగవతంలో నరసింహమూర్తిని నలుగురైదు గురు తాళ్ళతో లాగి పట్టినట్టు, తను హనుమంతరావును చంపబోతుండగా అడ్డపడేవాళ్ళెంతమంది వుంటే అంత మంచిది. రైలు కదిలింది. ఒక పోలీసు తలుపు తెరుచుకుని లోపల ప్రవేశించి, హనుమంతరావును చూడగానే చక్కని మిలిటరీ శాల్యూటొకటి కొట్టాడు. పోలీసూ హనుమంత రావూ సంభాషణలో పడ్డారు. ఇద్దరివంకా చూస్తూ చాలా సేపు గోవిందం కత్తి దుయ్యటం మరిచిపోయినాడు. జ్ఞాపకం వచ్చినప్పుడేమో హనుమంతరావును ఒంటరిగా చిక్కించుకుని చంపటమే చాలా క్షేమమనీ తనకు నిజంగా వాణ్ణిచంపాలని వున్నప్పుడు చూస్తూ చూస్తూ పోలీసెదట కత్తి తియ్యటం కేవలం తెలివితక్కువనీ తోచింది. అంగలకుదురులో పోలీసు దిగిపోయినాడు.

రైలు కదిలింది. హనుమంతరావు ఒంటరిగా దొరి కాడు. యేం చెయ్యాలా అని ఆలోచించటం మొదలు పెట్టాడు గోవిందం. రెండు నిమిషాలు గడిచినై.

"ఈ జన్మ మిక దుర్లబమురా!"

గోవిందం కొట్టినట్టు ఉలిక్కిపడ్డాడు. ఆ గుడ్డివాడూ, ఆ పిల్లా ఎప్పుడెక్కారో ఎలా ఎక్కారో తెలీదు కాని వాడి మాట మాత్రం అతనికి కొంత సహాయం చేసింది.

"ఇంత దుర్లభమైన జన్మ హనుమంతరావుకు మనం ఎందు కంతం చెయ్యాలి?" అన్నాడతను అంతరాత్మతో.

"యేడిశావులే!" అంది అంతరాత్మ.

గుడ్డివాడు కాస్సేపు పాడి "బాబుల్లారా తండ్రు ల్లారా!" అంటూ హనుమంతరావు వేపు చెయ్యి చూచాడు.

హనుమంతరావు వాడిమీద కాట్లకుక్కల్లే పడి, "ఫుంటాకోర్ ! ఎవడా నువ్వు ? మొద్దల్లే వున్నావు. కూలి చేసుకోలేవూ ? గుడ్డివాడివైతే ఎలా కనపడుతున్నాను ?" అన్నాడు.

"మసకగా కనపడ్తది బాబా !" అన్నాడు గుడ్డి.

హనుమంతరావు ధుమధుమ లాడుతూనే వాడిచేతిలో ఒక అణా పడేసి "ఫో" అన్నాడు.

"పాపం. వాడు చాలా మంచివాడే ! వాణ్ణెందుకు చంపటం ! మాన్ ఇన్ బ్లాక్ అని చదవలా ?" అన్నాడు దీనంగా గోవిందం.

"నీకు సిగ్గు లేదుట్రా ? నువ్వు కొజ్జావా ? నిన్ను—"

'నీ యిష్టం వచ్చినట్టేడు ! నాకేమీ అభ్యంతరం లేదు. న్యాయం చెప్పాను వినలేదు. పోనీ, వేజెండ్లలోపల వీడు చచ్చినవాడే !'.

'అలా అను యింకా—'

'చాల్లే!'

సంగం జాగర్లమూడిలో రైలాగకమునుపే గుడ్డివాడు మాయమైనాడు. హనుమంతరావు ఒక బల్లమీద కాళ్లు చాచుకుని పడుకున్నాడు. ఈ సారైనా ఇద్దరూ ఒంటరిగా ప్రయాణం చేసే భాగ్యత కలగలేదు. ఒక పల్లెటూరి కుర్ర వాడు ఆ పెట్టెలో ఎక్కి తలుపు తెరచి చుట్ట కాలుస్తూ నిల బడ్డాడు, రైలు సాగింది.

అయిదు నిమిషాల కాలం గడిచింది. పల్లెటూరి కుర్ర వాడు చుట్ట ఆర్పి తల పారేసి, హనుమంతరావు దగ్గిరి కొచ్చి 'లెగయ్యా! పగలేం పడక?' అన్నాడు.

'నన్ను చూస్తే నీకెందుకంత ఆపేక్ష!' అన్నాడు హనుమంతరావు

'ఇంకెవ్వరూ కూకోక్కూర్లేదేం? లెగో!'

'అలా కూర్చుందూ!'

"నేను కిటికీకాడ కూకోవాలి."

'అయితే నేను కిటికీకాడ తొంగోవాలి'

'సాల్లే లెగు'

'నే లెగవలేను'

'లెక్కపోతే లెగదీత్తారు!' అంటూ ఆ కుర్రవాడు హనుమంతరావు చెయ్యిపట్టుకున్నాడు. మరుక్షణంలో యేం జరిగిందో వివరంగా గోవిందరావు చూడలేదు. దభాలున చప్పుడయింది పల్లెటూరి కుర్రవాడు విసురుగా వెళ్ళి ఒక మూల దభాలున పడ్డాడు. చొక్కా చేతులు కిందికి దింపు తున్నట్టు నటించి హనుమంతరావు మళ్ళీ నడుం వాల్చాడు.

మూలనించి యేదో శబ్దం వినపడ్డది.

'ఈ సారి నా వూసెత్తితే ఆసుపత్రే గతి!' అంతా నిశ్శబ్దం, గుంటూరుబండి హోరుతప్ప.

వేజెండ్ల స్టేషనులో కుర్రవాడు యింకో పెట్టె చూసు కున్నాడు. గోవిందం, హనుమంతరావూ వున్న పెట్టెలో యింకో రెక్కకుండానే బండి సాగింది.

'ఇదే సమయం!' అంది అంతరాత్మ.

గోవిందరావు ధైర్యం యావత్తూ చిక్కబట్టి, 'వీలు పడదు' అన్నాడు.

'ఏమిటీ?' అన్న దంతరాత్మ నిర్ఘాంతపోయి.

'వల్లకాదు!'

'ఓరి పిరికి—'

'నోరుముయ్!'

○ ○ ○

'అన్నట్టు, ఉదయం మీాయింటి కొచ్చానురా! అవసరమైన పనుండి. నీభార్యావున్నది చూడకగదిలోకి వెళ్లాను. ఆవిణ్ని చూడనే గాభరాపడి బయటపడ్డాను.'

గోవిందరావు కొక్కసారిగా ఎగరటం చాతయినట్టయింది. తక్షణమే హనుమంతరావు మెడమీాదపడి అతని రెండు చెంపలూ ఎందుకు ముద్దు పెట్టుకోలేదో గోవిందరావిప్పటికీ చెప్పలేదు.

'అలాగుట్రా ? ఏది ? నువ్వొచ్చిన పనేదో చెప్పుకురా !'

యింకొకసారి అంతరాత్మ చెప్పినమాటలు వింటే చండాలున్నే ననుకున్నాడు గోవిందం.